
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 6 జూన్ 2024
5





ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు విభిన్నంగా ఆవిష్కారమైంది. ఎన్నికలకు ముందు ఊహించినట్టుగానే కాంగ్రెస్ తన బలాన్ని చాటుకోగా, బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు భారీగా గండి పడింది. అసలు ఓటుబ్యాంకే లేని బీజేపీ కొత్త ఓటు బ్యాంకును సృష్టించుకొని పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికలు ఊరట కలిగించగా, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మాత్రం తీవ్ర నిరాశను మిగిల్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు (సీపీఐతో కలిపి) 7,33,293 ఓట్లు రాగా, తాజా లోక్‌సభ ఎన్నికల్లో 7,66,929 ఓట్లు లభించాయి. అంటే 33,636 ఓట్లు మాత్రమే పెరిగాయి. కానీ బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురు కావడంతో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం దక్కింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేనకు కలిపి 16,976 ఓట్లు రాగా, తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 1,18,636 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ఓటమి గాయంనుంచి తేరుకోకముందే, బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల రూపంలో మరో దెబ్బ తగిలింది.



కాంగ్రెస్ జోరు..



కారు బేజారు

- కాంగ్రెస్ ఓటు బ్యాంకులో స్వల్పంగా పెరుగుదల
- బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెదిరిపోవడంతో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ
- గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే 1,68,557 ఓట్లు కోల్పోయిన బీఆర్ఎస్
- బీఆర్ఎస్ ఓటు బ్యాంకు నుంచి 1,01,660 ఓట్లు బీజేపీకి బదిలీ
- అన్ని సెగ్మెంట్లలో రఘురాంరెడ్డికి దక్కిన మెజారిటీ

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తారుమారైన బలాబలాలు

ఖమ్మం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను పరిశీలిస్తే గత అసెంబ్లీకి ఇప్పటికి ఓటుబ్యాంకు పరంగా స్వల్పగానే పెరిగినా ఆధిక్యతలో భారీగా చూపించింది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కోటకు బీటలు పడడంతో ఆ పార్టీ ఓటుబ్యాంకు చెల్లాచెదురు కావడంతో కాంగ్రెస్‌కు ఆధిక్యత కలిసివచ్చింది. ఖమ్మం, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఘోరంగా దెబ్బతిన్నది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాలో బీఆర్ఎస్ మరింతగా చతికిలపడింది. ఉన్న నాయకులంతా బలం చాటుకునేందుకు ప్రయత్నం సాగించినా జిల్లా ఓటర్లు బీఆర్ఎస్‌ను ఈసారి కూడా దూరంగానే ఉంచారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకు మాత్రం చెక్కుచెదరనివ్వలేదు. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 7,66,929 ఓట్లు లభించాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐతో కలిపి 7,33,293 ఓట్లు రావడం జరిగింది. 33,636 ఓట్లు మాత్రమే కాంగ్రెస్‌కు పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల పరంగా ఏడు నియోజకవర్గాల్లో మెజారిటీ చూస్తే అప్పుడు 2,66,162 ఓట్లు రాగా, ఇప్పుడు కాంగ్రెస్‌కు 4,67,847 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఓట్లు పెరగకపోయినా మెజారిటీ రావడానికి ప్రధాన కారణం లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటుబ్యాంకు పడిపోవడంతో పాటు బీఆర్ఎస్ ఓటుబ్యాంకు బీజేపీకి బదిలీ అయింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 2,99,082 ఓట్లు రాగా, గత అసెంబ్లీ ఎన్నికల తరుణంలో 4,67,639 ఓట్లు వచ్చాయి. 1,68,557 ఓట్లు బీఆర్ఎస్ కోల్పోయింది. ఇందులో లక్షపైగా ఓట్లు బీజేపీకి క్రాస్ అయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేనకు కలిపి 16,976 ఓట్లు రాగా, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 1,18,636 ఓట్లు వచ్చాయి. 1,01,660ఓట్లు బీఆర్ఎస్ ఓటు బ్యాంకునుంచి బీజేపీకి బదిలీ అయ్యాయి. బీఆర్ఎస్‌కు చెందిన 33,636 ఓట్లు కాంగ్రెస్‌కు కూడా బదిలీ అయ్యాయి. మరో 33,201 బీఆర్ఎస్ ఓట్లు స్వతంత్రులు, చిన్నాచితక పార్టీలకు క్రాస్ అయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 2,99,082 ఓట్లు రావడంతో కాంగ్రెస్ భారీ ఆధిక్యత సొంతం చేసుకుంది. ఖమ్మం సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ పూర్తిగా దెబ్బతిన్నది.

బీఆర్ఎస్ ఓటుబ్యాంకు తారుమారు

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 86,570 ఓట్ల ఆధిక్యత చూపింది. కాంగ్రెస్‌కు 125,459 ఓట్లు రాగా, (మిగతా 6వ పేజీలో)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల

లెక్కింపు షురూ

- మొత్తం 96 టేబుళ్ల ఏర్పాటు
- ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్ల లెక్కింపు
- నాలుగు రౌండ్లలో పూర్తికానున్న తొలి ప్రాధాన్య ఓట్లు
- నల్లగొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియ


నల్లగొండలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు దృశ్యం

నల్లగొండ, జూన్ 5: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు నిర్వహిసున్నారు. గత నెల 27న మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ ఉప ఎన్నికలో 72.44 శాతం పోలింగ్ నమోదైంది. మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం పోలైన ఓట్లను మూడు విడతలుగా లెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 96 టేబుళ్లపై 3,36,013 ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. ఈ ఓట్లను బ్యాలెట్ బాక్సుల వారీగా తీసుకువచ్చి 25 ఓట్ల చొప్పున ఒక కట్ట కడతారు. సాయంత్రం 4గంటల వరకు 25 ఓట్ల చొప్పున బ్యాలెట్లను బండిల్స్ కట్టే ప్రక్రియను చేపట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపును చేపట్టారు. మొత్తం 96 టేబుల్స్ ఏర్పాటుచేయగా, ఒక్కో టేబుల్‌పై 1000ఓట్ల చొప్పున లెక్కిస్తున్నారు. ప్రతి రౌండ్లో 96వేల ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. దీంతో నాలుగు రౌండ్లలోనే మొదటి ప్రాధాన్య ఫలితం రానుంది.

కోటా ఓటు వచ్చేంత వరకు లెక్కింపు

ప్రాధాన్య క్రమంలో ఓటేసే ఈ ఎన్నికలో అభ్యర్థికి మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు దాటి ఒక్క ఓటు అదనంగా వస్తేనే గెలిచినట్లు ప్రకటిస్తారు. దాన్నే కోటా ఓటుగా పరిగణిస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో కోటా ఓటు ఎవ్వరికీ రాకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. పోటీదారుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీ నుంచి ఎలిమినేట్ చేసి, అతడి బ్యాలెట్లలో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. ఇలా దిగువ నుంచి ఒక్కొక్కరినీ ఎలిమినేట్ చేస్తూ వారు మొదటి ప్రాధాన్య ఓట్లు పొందిన బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లను కలుపుతూ వస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎక్కువ ఓట్లు సాధించిన మొదటి అభ్యర్థి మినహా, కోటా ఓటు సరిపోకపోతే రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి సంబంధించిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను కూడా లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే తృతీయ ప్రాధాన్య ఓట్లను కూడా ఇదే పద్ధతిలో లెక్కిస్తారు. చివరికి కోటా ఓట్లు వచ్చిన వారిని విజేతగా ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. కాగా, తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి మొత్తం నాలుగు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపు చేస్తున్న గోదాముల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖలో అన్ని ర్యాంకులకు చెందిన 800 మంది సిబ్బందిని బందోబస్తుకు నియమించారు.

మామిడి చెట్టుపై పిడుగు

- కింద ఆడుకుంటున్న బాలుడి మృతి » మరో ఇద్దరికి గాయాలు
- మరో ఘటనలో మూడు దుక్కిటెద్దులు మృతి 6



మంత్రి తుమ్మల సమక్షం.. విరిసిన సంబురం..

ఖమ్మం, జూన్ 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తోపాటు మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, బానోతు రామచంద్రునాయక్, భూక్యా మురళీనాయక్, రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు నూకల నరేష్‌రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు దమ్మపేట మండలం పాకలగూడెంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయక్షేత్రంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం చేసిన కృషిని వారు అభినందించారు. మహబూబాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా తుమ్మల కీలకంగా పనిచేశారని, అందరి సమష్టి కృషి వల్లే భారీ మెజారిటీ వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలతోపాటు పలువురు నాయకులు బలరాంనాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తుమ్మల యుగంధర్, జిన్నారెడ్డి భరత్‌చంద్ర, సాధు రమేష్‌రెడ్డి, నున్నా రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీకి

పకడ్బందీ ఏర్పాట్లు



- హాజరుకానున్న 18,403మంది..
- జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష
- ఉదయం 10 గంటల తర్వాత లోనికి అనుమతించరు 6
- 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు: కలెక్టర్



నేటి నుంచి

బడిబాట

- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల పెంపుదలే లక్ష్యం
- రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్ విడుదల

ఖమ్మం ఖానాపురం హవేలి/బోనకల్, జూన్ 5: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం కోసం జూన్ 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్వహించనుంది. ఈ మేరకు సమగ్ర శిక్షాభియాన్ రాష్ట్ర డైరెక్టర్ మల్లయ్యభట్టు బుధవారం జీవో విడుదల చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రధానంగా విద్యార్థుల నమోదును పెంచడమే బడిబాట లక్ష్యంగా పేర్కొన్నారు. సమాజ భాగస్వామ్యంతో బడుల బలోపేతానికి శ్రీకారంచుట్టేలా అందరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బడిఈడు పిల్లల గుర్తింపు

బడిబాట కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలను సమీప పాఠశాలల్లో నమోదు చేయడానికి ప్రాధాన్యత ఇస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడం, గుణాత్మక విద్యను అందించడం లక్ష్యంగా బడిబాట నిర్వహించనున్నారు. సమాజ భాగస్వామ్యం, మద్దతుతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం కోసం కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్డేట్ చేసుకోవడం, 5వ తరగతి, 7వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత తరగతుల్లో నమోదు చేయించటం, తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలలో ప్రత్యేక ప్రణాళిక ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు పెంచటం వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. బడిబయటి పిల్లలను గుర్తించి వారి వయస్సుకు తగిన తరగతిలో నమోదు చేయాలి.

బాలికా విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించి బాలికలు అందరినీ పాఠశాలల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిలో జూన్ 6న సన్నాహక సమావేశం నిర్వహించుకోవాలి. కార్యక్రమ ప్రణాళిక తయారు చేసుకోవాలి. బడిబాట నిర్వహణకు అవసరమైన కరపత్రాలు, బ్యానర్ తదితర ఏర్పాట్లు చేసుకోవాలి. 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అన్ని గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించాలి. 10నుంచి 19వ తేదీవరకు నిర్ధారించిన రోజువారీ కార్యక్రమాలు నిర్వహించాలి. చివరి రోజైన 19న విద్యార్థులకు క్రీడలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక వనరులను పాఠశాల నిధుల నుంచి ఖర్చు చేయాలి. బడిబాట విజయవంతంగా నిర్వహించి అధికంగా విద్యార్థులను నమోదు చేసిన పాఠశాలలను జిల్లాస్థాయిలో 3, రాష్ట్రస్థాయిలో 10 పాఠశాలలను ఎంపిక చేసి బాధ్యులను సన్మానిస్తారు.

బిర్యానీలో

బొద్దింక




తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్


- ఖమ్మం రాయల్ గ్రాండ్ రెస్టారెంట్‌లో కలుషిత ఆహారం
- సగం తిన్న తర్వాత గుర్తించిన వినియోగదారుడు
- ఆహార తనిఖీ డైరెక్టర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదు
- వెనువెంటనే తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్
- హోటల్ యాజమాన్యంపై కేసు నమోదు 6


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు 6

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

ప్రజలకు అందుబాటులో ఉంటా.. : బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు

విలక్షణం.. 'విజ్జు పండూం'


రేలా రేలా పాట పాడుతూ నృత్యాలు చేస్తున్న ఆదివాసీలు

- గిరిజన పల్లెల్లో మొదలైన భూమి పండుగ సందడి
- అడవి బిడ్డల సంప్రదాయానికి ప్రతీక
- మగవాళ్ల వేట.. ఆడవారి ఆట...
- ఈ పండుగ తరువాతే సాగుపనులకు శ్రీకారం
- ఐదు రోజుల పాటు ఉత్సాహంగా సాగనున్న పర్వం 6

తొలకరి జల్లులు మొదలై దుక్కులు దున్నే సమయం వచ్చిందంటే ఆదివాసీల తొలి పండుగ వచ్చేసినట్టే.. అదే విజ్జు పండూం (భూమి పండుగ). ఏటా తొలకరిలో ఏజెన్సీ గ్రామాల్లోని ఆదివాసీలు కలిసికట్టుగా సంప్రదాయంగా చేసుకొనే పెద్ద పండుగ తొలి పండుగ ఇది. ఇంటికొకరు వంతున మగవారంతా విల్లంబులు చేతపట్టుకొని, కాసిన జావని సొక్కు బుర్ర (సొరకాయ బుర్ర)లో నింపుకొని ఆ బుర్రని బుజాన తగిలించుకొని అడవికి వేటకు వెళ్లి జంతువులను వేటాడడం భూమి పండుగలో ప్రధాన అంశం. జంతువులను వేటాడమనేది భూమి పండుగలో వారి ఆచారం. ఇలా ఐదు రోజుల పాటు మగవాళ్లంతా వేటకు వెళతారు. వీరోచితంగా వేటను చేస్తే ఆ ఊరికి మేలు జరుగుతుందని, పంటలు బాగా పండుతాయన్నది నమ్మకం. ఈ విలక్షణ పండుగకు భద్రాచలం ఏజెన్సీ గ్రామాలు వేదిక కానున్నాయి.

- భద్రాచలం



సమావేశంలో మాట్లాడుతున్న కేతినేని హరీష్ తదితరులు

ఆంధ్రప్రదేశ్‌లో
న్యాయమే గెలిచింది

- ప్రజాగ్రహం ముందు ఎలాంటి వారైనా తలొంచాల్సిందే
- టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్ 5: ఏపీలో జగన్ పాలనకు విసుగు చెందిన ప్రజలు న్యాయాన్ని గెలిపించారని ఖమ్మం పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ అన్నారు. ఆంధ్రాలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం పట్ల బుధవారం టీడీపీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించి ఎన్డీఏలో అతిపెద్ద రెండో పార్టీగా అవతరించిందన్నారు. ఐదేళ్లుగా జగన్ పాలనకు విసుగు చెందిన ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకే చంద్రబాబునాయుడు ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని అమరావతిని రాజధానిగా నిర్మించేందుకు కృషిచేస్తారని ఆకాంక్షించారు. టీడీపీ హయాంలో మొదలు పెట్టిన పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేయాలని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తోడ్పాటు అందించి తెలంగాణలోనూ పార్టీకి పూర్వవైభవాన్ని సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో చుండూరు రాజేశ్వరి, కన్నేటి పృథ్వీ, కూచిపూడి జై, కొలికొండ మురళి, నాగండ్ల లక్ష్మణ్, పాలడుగు కృష్ణప్రసాద్, బోడెపుడి రవి, భైరు అప్పారావు, కొల్లు పూర్ణ, తన్నీరు ప్రవీణ్, నరసింహరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి
అందరి లక్ష్యం కావాలి

- సింగరేణి కార్మికుల సంక్షేమమే అధిక ప్రాధాన్యత
- పీవీకే 5 ఇంక్లైన్‌లో మ్యాన్‌రైడింగ్ సిస్టంను ప్రారంభించిన సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 5 : రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం కావాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రకటించారు. బుధవారం సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 ఇంక్లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మ్యాన్‌రైడింగ్ సిస్టింను ప్రారంభించారు. ఈసందర్భంగా భూగర్భ బావిలో మ్యాన్‌రైడింగ్ సంస్థ ద్వారా దిగిన కార్మికులు పని చేసే పని ప్రదేశాలను పరిశీలించారు. మ్యాన్‌రైటింగ్ సిస్టంద్వారా కార్మికులు ప్రని ప్రదేశాలకు సులువుగా వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సంస్థను ప్రారంభించామని అందు కోసం సుమారు రూ. 8. 82 కోట్లతో మ్యాన్‌రైడింగ్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. కార్మికులకు మరిన్ని సదుపాయాలు సమకూర్చేవి



మ్యాన్ రైడింగ్ సిస్టం ద్వారా భూగర్భ బావిలోకి దిగుతున్న సింగరేణి చైర్మన్ బలరాం



మ్యాన్‌రైడింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న బలరాం

ధంగా యాజమాన్యం చర్యలు చేపడుతున్నారు. కార్మికులపై పని భారాన్ని తగ్గించేవిధంగా ముందుకు సాగుతున్నామన్నారు. సింగరేణిలో కార్మికులు, ఉద్యోగులు సమిష్టిగాబొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్రపోషించాలన్నారు. సింగరేణి కార్మికులు కార్మికులకు సులకనభావంతో చూసే పద్దతితో స్వస్తి పలికి అందరు సమానమనే విషయన్ని గుర్తించాలన్నారు. కొత్తగూడెం ఏరియాలో గత ఏడాది సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాదించిన ఉద్యోగులు,కార్మికుల అబినందించారు. ఇదే స్పూర్తితో ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తలక్ష్యాలను సాదించాలని కోరారు. అనంతరం గౌతంఖని ఓపెన్‌కాస్టు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకోపార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. కొత్తగూడెం ఏరియాలో వీకే 7 ఓపెన్‌కాస్టుకు అనుమతులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరక్టర్ (పా) ఎన్‌వీకే . శ్రీనివాస్ డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, జనరల్ మేనేజరు షాలెం రాజు, 5ఇంక్లైన్ మేనేజరు పాలడుగు శ్రీనివాస్, కార్మికసంఘం నాయకులు రజాక్, మల్లిఖార్జున్‌తోపాటు సింగరేణి ఉద్యోగులు, కార్మికులు, కార్మికసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాములో పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

పకడ్బందీగా ఈవీఎంల
భద్రతా ఏర్పాట్లు

పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 5: పకడ్బందీగా ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌లో లోకసభ సాధారణ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి గదులకు సీళ్లు వేశారు. ఖమ్మం లోకసభ సాధారణ ఎన్నికల్లో వినియోగించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఆయా గదుల్లో భద్రపరచారు. వీవీప్యాట్లను మొదటి అంతస్థులోని హాల్లో సెగ్మెంట్ల వారీగా భద్రపర్చారు. రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెగ్మెంట్ తహసీల్దార్లు ఈవీఎంలను లెక్కపెట్టి సరిచూసుకొన్నారు. అనంతరం జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్ రూంలో భద్రపరచిన స్టాట్యూటరీ కవర్లు, వీవీప్యాట్ స్లిప్పులు, ఈవీఎం పేపర్లు, 17-సీ, పీవో డైరీ తదితర పత్రాల భద్రతను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సీహెచ్.స్వామి, రాంప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, రాంబాబు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు తుళ్లూరి బ్రహ్మయ్య, వి.రాజేష్, జి.నాగరాజు, పాలడుగు కృష్ణప్రసాద్, స్వర్ణ సుబ్బారావు, టి.సోగ్రామ్ నాయక్, బి.సునీల్ నాయక్ తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

ప్రజలకు అందుబాటులో ఉంటా.. : బీజేపీ నేత తాండ్ర వినోదరావు

ఖమ్మం బైపాస్‌రోడ్, జూన్ 5: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని బీజేపీ సీనియర్ నేత తాండ్ర వినోదరావు తెలిపారు. ఇకపై జరిగే ప్రతీ ఎన్నికలకు పార్టీ తరుపున కార్యాచరణ సిద్ధం చేస్తామని తెలిపారు. ఖమ్మం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ సమీపంలో ఉన్న బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో బుధవారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఇకపై కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు తాను ఖమ్మం వచ్చాన నన్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా అనునిత్యం ప్రజలతో ఉంటానన్నారు. అవసరమైతే ప్రజాసమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. డబ్బు ప్రభావం ఎక్కువగా ఉన్న ఖమ్మం నియోజకవర్గంలో ప్రజలు సుమారు లక్ష 18వేలు ఓట్లు వేయడం ఆనందంగా ఉందన్నారు. గత మూడు నెలలుగా తన వెంట ఉన్న టీడీపీ, ఎంఆర్‌పీఎస్, జనసేన, బీజేపీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ తరుపున పోటీచేసి గెలిచిన రామసహాయం రఘురాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల్లో రోజురోజుకు బీజేపీ పట్ల ఆదరణ పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో తప్పకుండా రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్ అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, శ్రీనివాస్, చావా కిరణ్, గెంటేల విద్యాసాగర్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జోరు.. కారు బేజారు...

(5వ పేజీ తరువాయి)

బీఆర్‌ఎస్‌కు 38,889 ఓట్లు లభించాయి. ప్రతి రౌండ్‌లోను భారీ ఆధిక్యత లభించింది. ఖమ్మంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 49381 ఓట్ల ఆధిక్యత మంత్రి తుమ్మలకు లభించగా, ఈసారి ఆ మెజారిటీ మరింత పెరిగింది. బీజేపీకి 32,398 ఓట్లు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో రావడం చెప్పుకోదగిన విషయం. గత గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 136016 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 86,635 ఓట్లు వచ్చాయి. ఈసారి సగానికిపైగా ఓటుబ్యాంకు పడిపోయింది. బీఆర్‌ఎస్ ఓటుబ్యాంకు బీజేపీకి క్రాస్ కావడంతో భారీగా నష్టపోయింది.

ఇక రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరులో 61,681 ఓట్ల మెజారిటీ లభించింది. ఇక్కడ కాంగ్రెస్‌కు 120069 ఓట్లురాగా బీఆర్‌ఎస్‌కు 58,388 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరులో మంత్రి పొంగులేటికి 56,650 ఓట్ల ఆధిక్యత రాగా, ఈసారి లోక్‌సభలో అదనంగా 5031 ఓట్ల ఆధిక్యత చూపించింది. ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1,27,820, బీఆర్‌ఎస్‌కు 71,170, బీజేపీకి 1815 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ 27వేలపైగా ఓటుబ్యాంకు కోల్పోయింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 12648 ఓట్లు వచ్చాయి.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో 39130 ఓట్ల ఆధిక్యత కాంగ్రెస్‌కు లభించింది. ఇక్కడ కాంగ్రెస్‌కు 114087 ఓట్లురాగా బీఆర్‌ఎస్‌కు 50617 ఓట్లు లభించాయి. బీజేపీకి 9074 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో మధిర లో భట్టికి 35,452 ఓట్ల ఆధిక్యత లభించింది. గతంకంటే లోక్‌సభలో అదనంగా 3678 ఓట్ల మెజారిటీ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 18970 ఓట్లురాగా బీఆర్‌ఎస్‌కు 73518 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 2021 ఓట్లు వచ్చాయి.

వైరా అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 61,778 ఓట్లు మెజారిటీ రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 98280, బీఆర్‌ఎస్‌కు 36502 ఓట్లు లభించాయి గత అసెంబ్లీ ఎన్నికల్లో వైరాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు 33,045 ఓట్లు రాగా, ఈసారి అదనంగా మెజారిటీ 28733 మెజారిటీ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 93,913 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 60868 ఓట్లు, బీజేపీకి మద్దతుతో జనసేనకు 2712 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి 4806 ఓట్లు వచ్చాయి.

సత్తుపల్లిలో కాంగ్రెస్‌కు 69,408 ఓట్లు మెజారిటీ రాగా, ఇక్కడ కాంగ్రెస్‌కు 120190 ఓట్లురాగా బీఆర్‌ఎస్‌కు 50782 ఓట్లు, బీజేపీకి 14626 ఓట్లు లభించాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయికి 19,640 ఓట్లు మెజారిటీ లభించగా ఈసారి అదనంగా 49768 మెజారిటీ పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 111245 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 91805 ఓట్లు, బీజేపీకి 1882 ఓట్లు వచ్చాయి.

కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గంవలో కాంగ్రెస్‌కు 76,175 ఓట్ల ఆధిక్యత రాగా కాంగ్రెస్‌కు 105402, బీఆర్‌ఎస్‌కు 29,222 ఓట్లు, బీజేపీకి 27240 ఓట్లు వచ్చాయి. గత అసెబ్లీ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు 26,547 ఓట్లు మెజారిటీ లభించింది.ఈ సారి కొత్తగూడెంలో కాంగ్రెస్ అదనంగా 49628 మెజారిటీ సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెంలో కాగ్రెస్ మద్దతుతో సీపీఐకి 80336, బీఆర్‌ఎస్‌కు 37555, బీజపీ మద్దతుతో జనసేనకు 1945 ఓట్లు వచ్చాయి.

అశ్వారావుపేటలో కాంగ్రెస్‌కు 42927 ఓట్లు ఆధిక్యత లభించింది. కాంగ్రెస్‌కు 76,116, బీఆర్‌ఎస్‌కు 33189, బీజేపీకి 9283 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణకు 28905 ఓట్ల ఆధిక్యత రాగా అదనంగా 14022 ఆధిక్యత పెరిగింది. గత అసెంబ్లీ 74993 కాంగ్రెస్‌కు , బీఆర్‌ఎస్‌కు 46088, బీజేపీ మద్దతతో జనసేనకు 2281 ఓట్లు వచ్చాయి.

ఈ విధంగా జిల్లాలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీల బలాలు అసెంబ్లీనుంచి లోక్‌సభకు మారాయి. అసెంబ్లీలో పోలింగ్ శాతం అధికంగా ఉండగా, పార్టీలకు ఓట్లు అధికంగా రాగా ఈసారి ఓటింగ్ శాతం పడిపోవడంతో బలాబలాలు పడిపోయాయి.

విలక్షణం..'విజ్జు పండూం'

- గిరిజన పల్లెల్లో మొదలైన భూమి పండుగ సందడి
- అడవి బిడ్డల సంప్రదాయానికి ప్రతీక
- మగవాళ్ల వేట.. ఆడవారి ఆట...
- ఈ పండుగ తరువాతనే సాగు పనులకు శ్రీకారం
- ఐదు రోజుల పాటు ఉత్సాహంగా సాగనున్న పర్వం

భద్రాచలం, జూన్ 5: ఆదివాసీలు నిర్వహించే విజ్జు పండూం పండుగా వారి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. దీనిని భూమి పండుగ అని కూడా అంటారు. విజ్జు అంటే విత్తనాలు(వంగడాలు) అని అర్థం. ఈ పండుగను ప్రతి ఏడాది జూన్ మొదటి వారంలో ప్రతి ఆదివాసీ గ్రామంలో నిర్వహిస్తారు. మూడు నుంచి ఐదు రోజుల పాటు ఈ పండుగ సాగుతుంది. పండుగ తంతులో భాగంగా ముందుగా మహిళలు గద్దెల వద్ద బిందెలతో నీళ్లు పోస్తారు. ఈ సమయంలో భూమి పండుగను ఉదహరిస్తూ రేలాపాటలు ఆలపిస్తారు. ఈ పండుగను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఏపీలో విలీనమైన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, యటపాక మండలాల్లోని ఆదివాసీ గ్రామాల్లో నిర్వహిస్తారు.



విల్లంబులతో భూమి పండుగ నిర్వహిస్తున్న ఆదివాసీలు

వేటలో భాగంగా మగవారంతా అడవంతా కలియ తిరుగుతుంటారు. వారి పెంపుడు కుక్కలు కూడా వారితో పాటే తిరుగుతుంటాయి. అవి కూడా చిన్న చిన్న జంతువులను వేటాడుతుంటాయి. అంతే కాకుండా ప్రమాదకరమైన జంతువులు సమీపంలో ఉంటే వారి వేట కుక్కలు ముందుగానే పసిగట్టి అరిచేలా యజమానులు వాటికి శిక్షణ ఇస్తుంటారు.

రేల పాటలతో మహిళల సందడి..

ఇక మగవాళ్లు వేటకు వెళితే ఇంటి పనులు వేకువనే ముగించుకొని మహిళలంతా కలిసి రేల పాటలు పాడుతూ ప్రధాన రహదారి వద్దకు చేరుకొని రహదారికి అడ్డంగా దుంగలు పెట్టి అటుగా రాకపోకలు సాగించే వాహనాలను ఆపి పైసలు ఇవ్వాలని అడుగుతుంటారు. సమీపంలో ఉన్న పెద్దపెద్ద ఊర్లకు కూడా వెళ్లి దుకాణాల వద్ద కూడా రేల పాటలు పాడుతూ డబ్బులు వసూలు చేస్తుంటారు. ఎవరైనా పైసలు ఇవ్వకపోతే వారి వాహనానికి చెట్ల కొమ్మలు, తాటాకులు కట్టి గేలి చేస్తుంటారు. ఆ విధంగా ఐదు రోజుల పాటు పైసలు వసూలు చేసుకొని చివరి రోజున పప్పు బెల్లం కొనుక్కొని వాటిని అందరూ పంచుకొని తింటారు.

వేటలో పడితే ఊరికి మేలట..

ఐదు రోజుల వేటలో ఏ ఒక్క చిన్న జంతువైనా వారికి వేటలో దొరికితే ఆ ఏడాది పంటలు బాగా పండుతాయన్నది వారి విశ్వాసం. అందుకే వేటకు వెళ్లడాన్ని వారు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరు. వేటకు వెళ్లిన రోజున ఏదైనా జంతువును వేటాడి తెస్తే వారంతా కలసి ఆ జంతువుని ఊర్లోకి సందడి చేసుకుంటూ మోసుకొస్తారు. వేట పడ్డ విషయాన్ని తెలుసుకొన్న మహిళలు రేల పాటలు పాడుతూ వారికి ఎదురేగి స్వాగతం చెప్పడం వారి ఆనవాయితి. అంతే కాకుండా ఎవరి విల్లంబునకు గురైై వేట పడిందో వారిని వీరుడిగా కొలుస్తూ రేల పాటలు పాడుతూ ఆ వ్యక్తికి అడవి పూలతో కట్టిన దండను వేసి ఊర్లోకి తీసుకొస్తారు.

ముత్యాలమ్మ చెట్టు వద్ద పూజలు..

వేటలో పడ్డ జంతువుని మోసుకొచ్చి ఆ ఊరిలో ఉన్న ముత్యాలమ్మ చెట్టు వద్ద ఉంచి పూజలు చేస్తుంటారు. పసుపు కుంకుమ కలపిన నీటిని ముత్యాలమ్మ చెట్టు చుట్టూ పోస్తూ రేల పాటలు పాడుతుంటారు. గ్రామ పెద్దలైన పటేలు, పూజారి, వేపారి(గ్రామ పెద్దల్లో ఒకరు)ముత్యాలమ్మ చెట్టు వద్ద పూజలు చేస్తారు. చివరిగా ఆ జంతువుని కోసి ఊర్లోని కుటుంబాలన్నీ భాగాలుగా పంచుకుంటాయి. ఇక ఎవరి చేతిలో వేట పడిందో ఆ వ్యక్తికి ఆ జంతువుకి చెందిన కొమ్ములు బహుమతిగా ఇస్తారు.

పండుగ ముగిశాకనే వ్యవసాయ పనులు..

వేట ముగిసిన తరువాతనే ఊరంతా వ్యవసాయ పనులకు ఉపక్రమిస్తుంటారు. విత్తనాలు చల్లి నారుమడులు కడుతుంటారు. భూమి పండుగ చేయనిదే వారు ఎట్టి పరిస్థితిలోనూ వ్యవసాయ పనులు మొదలు పెట్టరు. ముందుగా వ్యవసాయ పనులు మొదలు పెడితే ఆ ఏడాది పంటలు సరిగా పండవని, ఊరికి అరిష్టమని వారి భావన.

విత్తనాలు ఇవ్వడం లేదని రైతుల ధర్నా



వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చండ్రుగొండ, జూన్, 5: పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా చేసిన ఘటన చండ్రుగొండలో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం..వర్షాకాలం వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయాధికారులు రైతులకు ఇవ్వకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. రైతులకు జీలుగులు, పిల్లపెసర, జనుములు అందించాల్సి ఉండగా జీలుగులు మాత్రమే పంపిణీ చేయడంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పచ్చిరొట్ట విత్తనాలను సరాఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

చిరునోముల పాఠశాలలో మందుబాబుల వీరంగం

● అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ధ్వంసం

బోనకల్, జూన్ 5: మండలంలోని చిరునోముల ఉన్నత పాఠశాలలో మందుబాబులు మద్యం సేవించి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. మంగళవారం రాత్రి పాఠశాలలో మద్యం సేవించి అక్కడే సీసాలను పగులకొట్టారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేసి కుదరక పోవడంతో కర్రలతో ధ్వంసం చేశారు. ఆట వస్తువులను చిందర వందరగా పడవేశారు. పాఠశాల గదులకు వేసిన తాళాలను పగులకొట్టారు. ఈ సంఘటన పై అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి పిర్యాదు మేరకు ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాలలో మందుసీసాలను పగులకొట్టిన దృశ్యం

బిర్యానీలో బొద్దింక



ఆహారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5: మధ్యాహ్నం స్నేహితులతో, సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో కలిసి అలా బయటకు వెళ్లి రెస్టారెంట్లో మంచి భోజనం చేసి వద్దామనుకునే వారికి ఖమ్మంలోని కొన్ని రెస్టారెంట్లు బెంబేలెత్తిస్తున్నాయి. ఆహారాన్ని అందంగా డెకరేట్ చేసి ఆహార ప్రియుల ముందు పెడుతున్నారు.

ఖమ్మం నగరానికి చెందిన స్నేహితులు బోసు, గుర్నాదం కలిసి బుధవారం మధ్యాహ్న సమయంలో ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ సమీపంలోని రాయల్ గ్రాండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. రెండు చికెన్ బిర్యానీలు ఆర్డర్ చెప్పారు. వేడివేడిగా వచ్చిన బిర్యానీలను తింటున్న వారికి బిర్యానీతో కలిసి ఉడికిన బొద్దింక కనిపించింది. దీంతో ఒక్కసారిగా వాళ్లు నివ్వెరపోయారు. వెంటనే రెస్టారెంట్ యజమానికి పిర్యాదు చేశారు. యజమాని సరిగా స్పందించకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత గుర్నాధం రాష్ట్ర ఆహార తనిఖీ డైరెక్టర్ లీలావతికి వాట్సాప్‌లో బిర్యానీలో వచ్చిన బొద్దింకను పోస్ట్ చేశారు. దీంతో డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రాయల్ గ్రాండ్ రెస్టారెంట్ వంటశాలలోని ఆహార పదార్థాలను పరిశీలించారు. అయితే వంటశాలకు చుట్టూ ఎటువంటి అడ్డు లేకపోవటం, రహదారి పక్కకు వంటశాల ఉండటంతో పురుగులు పడుతున్నాయని గుర్తించారు. దీంతో ఆహార తనిఖీ అధికారులు కేసు నమోదు చేశారు.

పెళ్లాం వంట చేస్తే పురుగులు పడవా..

జిల్లా ఆహార తనిఖీ అధికారి కిరణ్‌కుమార్ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రెస్టారెంట్ నిర్వాహకులు బిర్యానీలో బొద్దింక పడటాన్ని సమర్థించుకున్నారు. ఇంట్లో పెళ్లాం వంటలు చేస్తే పురుగులు పడవా.. ఈ మాత్రం దానికి తనిఖీలు, వైరల్ చేయటం ఎందుకని జిల్లా ఆహార తనిఖీ అధికారినే ప్రశ్నించారు. ఇటువంటివి సహజమే అని సమర్థించుకున్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 5:ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్-1 పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 9న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలు జరుగుతాయన్నారు. 18,403మంది అభ్యర్థుల కోసం 52పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఐడెంటిటీ అధికారులను నియమించాలని, ప్రతీ అభ్యర్థిని పూర్తి స్థాయిలో చెక్ చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి సెల్‌ఫోన్ అనుమతి ఉండదన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సైతం సెల్‌ఫోన్ అనుమతి ఉండదన్నారు.

అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకునేందుకు వీలుగా అవసరమైన మేర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం ప్రత్యేక ఇన్విజిలేటర్లను నియమించాలన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి, పరీక్షా కేంద్రాన్ని ధ్రువీకరించుకోవాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9గంటల వరకు కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు షూస్ వేసుకొని పరీక్షకు రావొద్దని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గేట్ మూసి వుంటుందని, పరీక్ష ముగింపు సమయం తర్వాత అభ్యర్థులను వెళ్లేందుకు అనుమతిస్తారని తెలిపారు. 13 ఫ్లయింగ్ స్క్వాడ్, 52మంది శాఖాధికారులు, 184మంది గుర్తింపు అధికారులు నియమించినట్లు తెలిపారు. ఇన్విజిలేటర్ల హాళ్ల కేటాయింపు పరీక్ష రోజు ఉదయం 9.30గంటలకు లాటరీ ద్వారా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్లు, విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జాన్‌బాబు, ఎస్బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్టుపై పిడుగు

- చెట్టుకింద ఆడకుంటున్న ఓ బాలుడు మృతి
- మరో ఘటనలో మూడు దుక్కిటెద్దులు ..

ఆళ్లపల్లి/కరకగూడెం, జూన్ 5: అప్పటి వరకు మామిడి చెట్టు కింద సరదాగా ఆటాడుకుంటున్న నలుగురు పిల్లల సంతోషం ఒక్క క్షణంలో ఆవిరైంది. మామిడి చెట్టుపై పిడుగుల పడడంతో ఓ బాలుడు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలం, రాఘవాపురం పంచాయతీలోని సీతానగరం గ్రామానికి చెందిన గొగ్గల రంజిత్, గొగ్గల శివశంకర్, గొగ్గల శివశంకర్, మేకల సంతోష్(13)లు కలిసి బుధవారం సాయంత్రం సమయంలో గ్రామ శివారులోని మామిడిచెట్టు దగ్గరకు సరదాగా చెట్టు నీడలో ఆడుకుంటూ మామిడి కాయలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో వాతావరణం ఒక్కసారిగా మారి గాలి, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో వారు ఉన్న చెట్టుపై పిడుగు పడింది. దాంతో మేకల సంతోష్(13) అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు శివశంకర్లకు తీవ్ర గాయాలయ్యాయి. గొగ్గల రంజిత్ కాస్త పక్కకు ఉండటంతో సురక్షితంగా బయటపడ్డాడు. తరువాత రంజిత్ వెళ్లి ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పడంతో వారంతా వచ్చి మేకల సంతోష్ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి, గాయపడ్డ ఇద్దరు శివశంకర్లను ఆళ్లపల్లి వైద్యశాలకు తీసుకెళ్లారు. మేకల సంతోష్ తండ్రి గతేడాది జ్వరంతో మృతి చెందగా ఇప్పుడు కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. పుట్టుకతో మూగ చెవుడు అయిన సంతోష్ భద్రాచలంలో 6వ తరగతి చదువుతున్నాడు. బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.

రామాలయంలో జ్యేష్ఠ మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జూన్ 5: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జ్యేష్ఠమాసంలో నిర్వహించే ఉత్సవాల వివరాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి వైదిక సిబ్బంది అందజేశారు. 9న పునర్వసు తిరువీధి సేవ, 10న పట్టాభిషేకం, 18న పెరియాళ్వారు తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 21న జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ చేయనుండగా 22న జ్యేష్ఠపూర్ణిమను పురస్కరించుకొని 81 కలశాలతో స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా జ్యేష్ఠాభిషేకం సందర్భంగా 22న నిత్యకల్యాణాలను నిర్వహించరు. అంకురారోపణం కారణంగా 21న సంధ్యాహారతి నిర్వహించరు.

భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం నిర్వహించారు.

జీకే-5 ఓసీకి పర్యావరణ అవార్డు అందజేత

ఇల్లెందుటౌన్, జూన్ 5: ప్రపంచం పర్యవరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ అవార్డు పొందిన జీకే5 అధికారులకు బుధవారం సింగరేణి సీఎండి బలరాంనాయక్ చేతుల మీదుగా అధికారులు అందుకున్నారు. జీకే5 ఓసీ ప్రాజెక్టు అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఎన్విరాల్‌మెంట్ అధికారి ధనుంజయరెడ్డి తదితరులు ఈ అవార్డును స్వీకరించారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అధికారులను అభినందించారు



పర్యావరణ అవార్డు అందుకుంటున్న జేకే5 ఓసీ అధికారులు

పోదాం పద.. సర్కార్ బడికి!



- విద్యార్థులకు ప్రత్యేక వసతులు
- మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం
- అర్హులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన
- పుస్తకాలు, దుస్తులు, లంచ్ ఉచితం

చర్ల, జూన్ 5: ప్రభుత్వ పాఠశాలలు అనగానే ప్రజల్లో అదో రకమైన భావన, ఇక్కడ దొరకని ఉత్తమ చదువు ప్రైవేట్ పాఠశాలల్లో దొరుతుందనే ఆలోచన. దీన్ని సరా చేసుకునే జిల్లాలోని ప్రతీ గ్రామం, వీదుల్లో ప్రైవేట్ పాఠశాలలు వెలుస్తున్నాయి. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి పోతుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలు మూత పడుతున్నాయి. లోతుగా ఆలోచిస్తే ప్రైవేట్ పాటశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన సౌకర్యాలు ఉంటున్నాయి. నూటికి 90 శాతం ప్రభుత్వ పాటశాలలు ప్రైవేట్ పాఠశాలలు తీసి పోవు. విశాలమైన గదులు, ఆహ్లాదకరమైన ఆవరణ, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, బట్టలు, నాణ్యమైన బోధన ఇలా అన్నింటిలోనూ ప్రభుత్వ బడులు మెరుగ్గా కనిపిస్తున్నాయి. కానీ చాలా మంది మేడి పండు చూడు అన్న సామెతలా మోస పోతున్నా రు. ఫీజులు అధికంగా చెల్లిస్తున్నా పిల్లలకు మెరుగైన మార్కులురావడంలేదు.

ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు కర్చు పెట్టకుండానే ఉత్తమ మార్కులు సాదిస్తున్నారు. చాలా మంది ప్రైవేట్ వైపు మొగ్గు చూపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి పోతుంది. అవసరాన్ని బట్టి పాఠశాలలను కూడా తీసేస్తున్నారు. కాబట్టి నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపద్యంలో ప్రభుత్వ బడులల్లో పిల్లల్ని చేర్పించాలి. పేద పిల్లలకు ఎంతో మందికి ఉపమోగ పడుతున్న బడులను బ్రతికించు కోవాలి.

బడిని బతికించడం అందరి బాధ్యత

తెలంగాణ ప్రభుత్వం బడులపై దృష్టి సారించడం. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు కూడా ఎంతో ఉత్సాహంగా పని చేస్తుండంతో ప్రభుత్వ పాఠశాలల పనితీరు చాలా వరకు మెరుగు పడింది. పాఠశాలలకు ఇప్పటికే పుస్తకాలు చేరుకున్నాయి. పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించారు. ఎలాంటి ఫీజులు తీసుకోకుండా చదువు నేర్పిస్తూ, మెరుగైన విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ బడులకు పిల్లల్ని పంపించాలి.

తల్లి, దండ్రులు ఆలోచన చేయాలి

మెరుగైన విద్యా ప్రమాణాలు అందిస్తున్న ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని ఎందుకు చేర్పించ కూడదనే ఆలోచనను విద్యార్థుల తల్లిదండ్రులు చేయాలి. ప్రవేట్ పాఠశాలలపై ఉన్న మక్కువను తగ్గించు కోవాలి. అలాగే పిల్లల చదువు కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. వేలాది రైపాయలను ఉపాధ్యాయులకు చెల్లిస్తోంది. వాటిని సద్విని యోగం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. అధికారులు ప్రభుత్వ బడులపై దృష్టి సారించక పోవచ్చు కానీ యువత, స్థానికులు సర్కారు బడులపై దృష్టి సారించాలి. బడుల్లో అందుతున్న మెరుగైన విద్యను పిల్లలు అందరికీ అందేలా చూడాలి. ప్రభుత్వ బడుల యొక్క ప్రాధాన్యతను వివరించాలి.

పుస్తకాలు ఉచితం

ప్రభుత్వ పాఠశాలలకు పంపించే విద్యార్థుల పుస్తకాలు పిల్లలు మోయలేనివి గా ఉంటున్నాయి. అలాగే వీటి కోసం అధిక నగదును ఖర్చు చేయాలి. ఇది అంతా విద్యార్థుల తల్లి దండ్రులకు భారంగా ఉంటుంది. కానీ ప్రభుత్వ పాఠశాల్లో చదువు కునే విద్యార్థులకు పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. తల్లి దండ్రులకు ఖర్చు తప్పుతుంది, పిల్లలు పెద్దగా బరువులు మోయాల్సిన పనీ ఉండదు.

కడుపు నిండా భోజనం

ప్రైవేట్ పాఠశాలల్లో చదువు కునేవిద్యార్థులకు ప్రతీ రోజు ఇంటి నుంచి భోజనం తీసుకుని వెళ్లాలి. కానీ ప్రభుత్వ పడుల్లో సన్న బియ్యంలో అన్నం పెడుతున్నారు.వారానికి రెండు కోడి గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పు, అరటి పండుతో భోజనం వడ్డిస్తున్నారు. ఇక వేల రుచిలో తేడాలు వచ్చినా వెంటనే ఉపాధ్యాయులు సమస్యను పరిష్కరిస్తున్నారు.

ఉచితంగా దుస్తులు

ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులకు మనమే వేలు ఖర్చు చేసి యూనిఫాంలు కొనాలి. కానీ ప్రభుత్వం పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతీఏటా రెండు జతల బట్టను అందజేస్తుంది. పిల్లల కొలతలు తీసుకుని మరీ కుట్టిస్తున్నారు. ఇందుకోసం ప్రతీ ఏటా కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తోంది.

కంప్యూటర్ విద్య

అలాగే ప్రభుత్వ పాటశాలల విద్యార్థులకు కంప్యూటర్ విద్యను కూడా ప్రభుత్వం అందిస్తోంది. జిల్లా లోని చాలా ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు కూడా అందజేశారు. ప్రాథమిక విద్యనుంచే విద్యార్థులకు కంప్యూరట్ విద్యా అందనుంది. ఇందుకోసం ప్రభుత్వం భారీగా నగదు ఖర్చు చేస్తోంది.

డయల్ 100కు 4,547 కాల్స్

ఖమ్మంక్రైం, జూన్5: సమాజంలో పెరిగిపోతున్న నేర ప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన, రక్షణే ధ్యేయంగా ఏర్పాటైన డయల్ 100కు మే నెలలో 4,547కాల్స్ వచ్చాయని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డయల్‌కు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి 100 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. వచ్చిన కాల్స్‌లో మహిళలపై వేధింపులు-3, దొంగతనాలు-10, సాధారణ ఘాతాలు-37, యాక్సిడెంట్లు-22, అనుమానాస్పద మరణాలు-3, ఇతర కేసులు-25 ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

● ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం, జూన్5: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతం లో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారికి జరిమానా వేసి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఇకపై మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు కూడా సీజ్ చేసి, కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. అదేవిధంగా ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 255 మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారని, వారికి రూ.1,27,500 జరిమానా విధించినట్టు తెలిపారు.

భద్రాద్రి జిల్లా డీవైఎస్‌వోగా సంజీవరావు



కలెక్టర్ ప్రియాంక అలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీవైఎస్‌వో సంజీవరావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్5: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీవైఎస్‌వోగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.సంజీవరావుకు జిల్లా కలెక్టర్ ప్రియాంకఅల బుధవారం అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా డీవైఎస్‌వోగా విధులు నిర్వహించిన పరందామరెడ్డి వ్యక్తిగత కారణాల తో రెండు నెలలు సెలవులపై వెళ్లారు.

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ఎంవోగా రాథోడ్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 5: ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ఎంఓగా డాక్టర్ రాథోడ్‌వినాయక్ ను నియమిస్తూ బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన డాక్టర్ అమర్‌సింగ్ వైద్యవిధాన పరిషత్‌కు కేటాయించడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా రాథోడ్ వినాయక్‌ను నియమించారు. ప్రస్తుతం రాథోడ్ మెడికల్ కళాశాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన బుధవారమే బాధ్యతలు చేపట్టారు.

సమాజాన్ని చైతన్య పర్చడమే కర్తవ్యం

» రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5: ప్రపంచపు విధానాలను తెలుసుకుంటూ, పెట్టుబడిదారి విధానం, కార్పొరేటీకరణ, మతోన్మాదం, ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్య పర్చడమే సీపీఎం శ్రేణుల ప్రథమ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు వివరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూన్ నెలలో నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాలపై బుధవారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం సుందరయ్య భవన్‌లో ఉపాధ్యాయులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులు పాటు గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే శిక్షణలో వర్తమాన రాజకీయాలపై కార్యకర్తలు, సానుభూతిపరులకు వివరించాలన్నారు. ప్రజలు ఎదుర్కోంటున్న నిత్య సమస్యలు వాటి పరిష్కారం కోసం కార్యచరణ, రైతాంగం, వ్యవసాయ కార్మికుల సమస్యలపై గ్రామ స్థాయిలో చైతన్యపర్చాలని సూచించారు. ఫాసిస్ట్ శక్తులపై వ్యతిరేకంగా పోరాటం చేసే శక్తులను తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు మిర్యం వెంకటేశ్వర్లు పలు అంశాలపై శిక్షణ తీసుకున్నారు. అంశాల వారీగా ఉపాధ్యాయ బృందాలను ఏర్పాటు చేసి వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎం. సుబ్బారావు, యర్రా శ్రీకాంత్, బొంతు రాంబాబు, బండారి రమేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించాలి

● డీఎఫ్వో సిద్దార్థ విక్రమ్‌సింగ్



మొక్కలకు నీళ్లు పోస్తున్న డీఎఫ్వో సిద్దార్థ విక్రమ్‌సింగ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5: ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం అర్బన్ పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. విద్యార్థులకు బహుమతులను అందించారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో రాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాలకృష్ణ

ఖమ్మంక్రైం, జూన్5: ఉద్యోగాల పేరిట ఇటీవల పలువురిని మోసం చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఖమ్మం టుటౌన్ సీఐ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన బొమ్మ పూర్ణచందర్‌రావు, కమాన్‌బజార్‌కు చెందిన దివ్వెల మధుసూదన్‌రావు, ముస్తఫానగర్‌కు చెందిన కొత్తపల్లి సత్యనారాయణ, జమ్మిబండ ప్రాంతానికి చెందిన బిజ్జగిరి శ్రీనివాస్‌లు ఏడుగురికి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లుగా ఉద్యోగాలు ఇస్తామని నమ్మించారు. వారికి నకిలీ అపాయింట్‌మెంట్లతో నకిలీ ఉత్తర్వులు సృష్టించి అందించినట్టు సీఐ తెలిపారు. నిందితులతో పాటు రెండు కంప్యూటర్లు, రెండు సెల్‌ఫోన్లు, ఫేక్ అపాయింట్‌మెంట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లుగా నియమించినకున్న బాధితులు, నిందితులకు డబ్బులు చెల్లించలేదని సీఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

» సింగరేణి చైర్మన్ బలరాం



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి చైర్మన్ బలరాం, అధికారులు

కొత్తగూడెం టౌన్, జూన్ 5 : పర్యావరణ పరిరక్షణకు సమిష్టి కృషి జరపాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాల ప్రయోజనాలను కాపాడినట్లు అవుతుందన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రతి ఏడాది సింగరేణి ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. సింగరేణిలో 5కోట్ల మొక్కలు నాటామని తెలిపారు. సింగరేణి సమీప ప్రాంతాల్లో సైతం మొక్కలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రతి అడుగు పచ్చదనం నినాదంతో సింగరేణి ఖాళీ స్థలాలు డంప్ యార్డుల్లో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణ కాలుష్య సైతం జరుగుతుందని అందు కోసం ప్రతి ఒక్క జూట్ బ్యాట్‌లను వినియోగించాలన్నారు. సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా) ఎన్‌వీకే. శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో వ్యక్తిగత చర్యలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి యాజమాన్యం సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించి ఇప్పటి వరకు 234.5 మెగావాట్ల విద్యుత్ విద్యుత్‌ను తయారు చేయడం జరిగిందన్నారు. నీటి, శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలు నాటడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాల్‌ఎంట్ జీఎం గణపతి, గుర్తింపు కార్మిక సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ప్రాతినిధ్య సంఘం ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్, సీఎంఈవో ఉపాధ్యక్షులు రాజీవ్‌కుమార్, జనరల్ మేనేజర్ (పర్సనల్) బీఆర్. దీక్షితుతోపాటు సింగరేణిఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కార్మికసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ అందరు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు.

అటవీ భూముల ఆక్రమణ

- కమలాపురంలో ఫారెస్టు భూముల కబ్జా
- యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



కమలాపురంలోని అటవీ భూముల్లో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణాలు

మణుగూరు, జూన్ 5: అటవీ భూముల ఆక్రమణ దారులతో అడవులు కనుమరుగవుతున్నాయి. యథేచ్ఛగా అటవీ భూములను అక్రమించుకుంటున్నారు. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామ శివారున ఉన్న ఫారెస్టు భూమిని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్నారు. రియల్ ఎస్టేట్ దారులు ప్లాట్లు చేసి మరి అమ్ముతున్నారని సమాచారం. సెంటు రూ.50 నుంచి 70 వేల వరకు అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. దట్టమైన అటవీ ప్రాంతంగా ఉన్న కమలాపురం గ్రామం ప్రస్తుతం పోడు కొట్టిన భూమిలా దర్శనమిస్తోంది. చెట్లు, పుట్టలను తొలగించి నెలను చదునుగా చేసి భూమి అమ్మకాలకు కేరాఫ్‌గా మారింది. కొంత కాలంగా కమలాపురం గ్రామంలోని కుడివైపున ఉన్న ప్రాంతమంతా రిజ్వర్డ్ ఫారెస్టు భూమిగా గుర్తించబడింది. అయితే స్థానికులు నివాసాల కోసం రోడ్డుకు కుడి భాగంగా ఇండ్లను నిర్మించుకుంటూ వచ్చారు. ఒకటి రెండు వరుసల్లో ఇండ్ల నిర్మాణాలు గత ఐదారేళ్ల క్రితం జరిగిపోయాయి. కాగా ఇప్పుడు కాస్త అటవీ ప్రాంతం అంతా కబ్జాకు గురవుతోంది. ఇండ్ల స్థలాలకు అమ్మకాలకు నెలవుగా మారింది. ఫారెస్టు భూమిలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ దందాపై అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఫారెస్టు అధికారులు చర్యలు చేపట్టి ఫారెస్టు భూములను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం..

● ఫారెస్టు రేంజ్ అధికారి ద్వాల్యా



కమలాపురం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా చోరబడి ఇంటి నిర్మాణాలు చేబడితే వాటిని వెంటనే తొలగిస్తాం. ఈ ప్రాంతం అంతా ఫారెస్టుకు చెందినది. అక్రమణ దారులపై కఠిన చర్యలు శాఖ తరుపున తీసుకుంటాం. రిజ్వర్డ్ ఫారెస్టు భూములకు కందకాలను తవ్వి హద్దులను కూడా ఏర్పాటు చేస్తాం.

మాదిగల జనసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్ 5: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7నుంచి అన్ని జిల్లాల్లో జరిగే మాదిగల జనసభ పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం హైదరాబాదులో ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ మాదిగలకు 12శాతం రిజర్వేసన్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జూన్ 7 నుంచి జరుగుతున్న మాదిగల జనసభను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, గడ్డే యాదయ్య, గజ్జెల్లి మల్లిఖార్జున్‌తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

» జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం, జూన్5: జిల్లాలో రైతులకు పారదర్శకంగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించి పాస్ పుస్తకాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో కూపన్‌ను అందిస్తున్నామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి గ్రామ పంచాయతీలో అవగాహన సదస్సులు నిర్వహించి పచ్చిరొట్ట విత్తనాలు సరఫరాపై అవగాహన నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సు ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

తూరుబాక పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎంపీవో ముత్యాలరావు

దుమ్ముగూడెం, జూన్ 5: మండలంలోని తూరుబాక గ్రామపంచాయతీకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్ చేతుల మీదుగా ఎంపీవో ముత్యాలరావు, కార్యదర్శి శ్వేతలు అవార్డును స్వీకరించారు. పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు సంయుక్తంగా ఈ అవార్డును ప్రకటించాయి. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో రాష్ట్రస్థాయి బహుమతి దక్కింది.

హీటెక్కిన మీటర్

- వారం రోజులుగా పెరిగిన విద్యుత్ వినియోగం
- 42లక్షల యూనిట్లు నుంచి 58లక్షలకు పెరిగిన డిమాండ్
- పెరిగిన ఉష్ణోగ్రతతో పాటుగా వ్యవసాయ సీజన్ ప్రారంభం
- అధిక లోడుతో కాలి పోతున్న ట్రాన్‌ఫార్మర్లు



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5: వారం రోజులుగా బానుడి భగ భగలు పెరిగాయి. అడపా దడపా జల్లులు కురియటంతో భూమిలేని వెచ్చదనం బయటకు వచ్చి ఉష్ణోగ్రతలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉక్క పోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. జిల్లా వ్యాప్తంగా 6,80,986 విద్యుత్ సర్వీస్‌లకు విద్యుత్‌శాఖ విద్యుత్ పంపిణీ చేస్తోంది. ఉదయం 11గంటలకే సూర్య ప్రతాపం పెరిగి రాత్రి 7గంటల వరకు ఉంటుంది. మధ్యాహ్నం 3గంటల సమయంలో, రాత్రి 6గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ వినియోగం పెరిగింది. వాతావరణంలో మార్పులతో ముదస్తు ఏరువాకకు అనుకూలంగా మారుతుండటంతో రైతులు తమ వ్యవసాయ భూముల్లోని చెత్తను తొలగించి వ్యవసాయ పనులు షురు చేశారు. ఈ క్రమంలో పామాయిల్, కూరగాయలు, పండ్ల తోటలకు విద్యుత్ వినియోగం మొదలైంది. ఇటు గృహ వినియోగం, వ్యవసాయ విద్యుత్, పరిశ్రమల విద్యుత్ వాడకంతో వారం రోజులుగా భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. వారం రోజుల క్రితం రోజుకు జిల్లాలో 42లక్షల యూనిట్లు వినియోగం కాగా శుక్రవారం నాటికి 58లక్షల యూనిట్లుకు డిమాండ్ పెరిగింది. ఇక రాత్రి సమయంలో పట్టణ ప్రజలు ఎక్కువగా ఏసీలు వినియోగించటంతో కరెంట్ ట్రిప్ తిప్పలు తప్పటం లేదు.

పెరిగిన విద్యుత్ వినియోగం

తేది	వాడిన విద్యుత్ యూనిట్లు లక్షల్లో
25న	42.80
26న	52.50
27న	53.40
28న	50.60
29న	52.80
30న	55.00
31న	57.80

విద్యుత్ కొరత లేదు...

● సురేందర్, జిల్లా విద్యుత్‌శాఖ, పర్యవేక్షక ఇంజనీరింగ్ అధికారి



వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. డిమాండ్ మేరకు సప్లయ్ పెంచుతున్నాం. విద్యుత్ పంపిణీలో ఇబ్బందులు లేవు. రాత్రి సమయంలో పట్టణ ప్రాంతాల్లో ఒకే సారి ఏసీలు వినియోగించటంతో అక్కడక్కడా సమస్యలు వచ్చినా వాటిని తక్షణమే పరిష్కారం చేసి విద్యుత్ పునరుద్దరణ చేస్తున్నాం.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

బూర్గంపాడు, జూన్ 5: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రమైన బూర్గంపాడు పాత బస్టాండ్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. కొత్తగూడెం డిపోకు చెందిన బస్సు భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్తుండగా, బూర్గంపాడు పాత బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో ఆటోలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆటో డ్రైవర్ నరాటి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

తల్లాడ, జూన్ 5: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నారయ్యబంజర గ్రామంలో చోటు చేసుకుంది. నారయ్యబంజర్‌కు చెందిన బాణోతు ఈశ్వర్(22) ఇటీవల అప్పుచేసి ద్విచక్రవాహనం కొన్నాడు. అప్పు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత..



విజయ మృతదేహం

ఏన్కూరు, జూన్5: వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏన్కూరు ఏస్సీ కాలనీకి చెందిన చిలుకూరి అఖిల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం వేములవాడకు చెందిన పూనెం విజయ(23)తో ఏడాదిక్రితం ప్రేమవివాహం జరిగింది. కొంత కాలంగా భార్య, భర్తల మధయ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. అత్త శిరోమణి, భర్త అఖిల్, ఆడబిడ్డ కీర్తన తరుచూ డబ్బులు తేవాలని వేదిస్తుండడంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తన బిడ్డను భర్త, అత్త, ఆడబిడ్డ కలిసి చంపారని మృతురాలి తల్లి సమ్మక్క బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

విద్యుదాఘాతంతో గేదె మృతి

నేలకొండపల్లి, జూన్5: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని కట్టుకాచారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంకర్ల బ్రహ్మం గేదెలను మేతకు వదలగా, సమీప పొలాల్లో కిందికి ఉన్న విద్యుత్ తీగలు తగిలి పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారుగా రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఈమేరకు రైతు బ్రహ్మం నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, జూన్ 5: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని శ్రీరాంపురం వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఏఎస్ఐ నారాయణ అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టరు డ్రైవరు నాగేశ్వరరావు, యజమాని నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దమ్మపేట, జూన్5: అనుమతులు లేకుండా మట్టి తొవ్వకాలను నిర్వహిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను దమ్మపేట పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకొని సీజ్ చేశారు. దమ్మపేట పరిధిలోని కోమళ్ల చెరువు సమీపంలో కొంతమంది మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. వీటి యజమానులు అక్కడి నుంచి వెళ్లిపోగా, అక్కడ వీటిపై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

నీట్‌లో న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు



వైరా, జూన్ 5: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన మెడికల్ ఫలితాల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించారు. ఎక్కిరాల కీర్తి 2061, గుడిపూడి ఉదయభాస్కర్ 4364, ఉండ్రు అజయ్‌బాబు 21270 ఆలిండియా ర్యాంకులు సాధించారు. ర్యాంకర్లను బుధవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తమ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. వైరా ప్రాంతానికి న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల తలమానికంగా ఉందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ఏవో ఎస్.నర్సింహారావు, మునిసిపల్ కౌన్సిలర్ గుడిపూడి సురేష్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీతారాంపురంలో తీవ్ర నీటిఎద్దడి



కారేపల్లి, జూన్ 5: మండల పరిధిలోని సీతారంపురం గ్రామంలో తీవ్ర తాగునీటిఎద్దడి నెలకొంది. మిషన్‌భగీరథ మంచినీరు సరిగ సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు మంచినీటి కోసం పంపులవద్ద పడిగాపులు కాస్తున్నారు. గతంలో గ్రామంలోకి తాగునీటీ మోటరు పనిచేయకపోవడంతో గ్రామస్థులకు నీటిఎద్దడి నెలకొంది. గ్రామంలోని చేతిపంపులలో నీరురావడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.అయితే తాగునీటి సరఫరా పై స్థానిక పంచాయతీ కార్యాదర్శి ఉషా కు గ్రామస్థులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని పెర్కొన్నారు. ఇదే విషయంపై ఆర్‌డబ్యూఎస్ ఏఈ నరేందర్‌ను వివరణ మిషన్‌భగీరథ నీరు సరిగా రావడంలేదని తనదృష్టికి వచ్చిందని, గురువారం గ్రామంలో విద్యుత్ మోటర్ ఏర్పాటుచేసి తాగునీరు ఎద్దడి లేకుండా చూస్తామన్నారు.

కోడ్ ముగియగానే అభివృద్ధి కొనసాగిస్తాం

- లోక్‌సభ ఎన్నికల్లో ఇంటి దొంగలను దూరంగా పెట్టాం
- అనుమతి లేకుండా ర్యాలీలు, గ్రూపులు చేస్తే సహించం
- ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ నాయకుడు దయానంద్

సత్తుపల్లి, జూన్ 5: సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొన్ని ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయని, కోడ్ ముగియగానే తిరిగి అభివృద్ధి పనులు కొనసాగిస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. బుధవారం వారు సత్తుపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేకపోయిన అభివృద్ధి పనులు తాము గత ఆరు నెలల్లో చేసామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఆరు గ్యారంటీలు అమలు కారణంగానే లోక్‌సభ ఎన్నికల్లో సత్తుపల్లి సెగ్మెంట్‌లో 61శాతం ఓట్లు సాధించామన్నారు. కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషి కారణంగా భారీ మెజార్టీ వచ్చిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు గాను ముందుకు సాగుతామన్నారు. రాబోయే రోజుల్లో నీతి, నిజాయితీగా ప్రజలకు సేవ సేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

ఎన్నికల్లో ఇంటి దొంగలను దూరంగా పెట్టాం-దయానంద్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలోని ఇంటి దొంగలను దూరంగా పెట్టామని, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థికి వెన్నుపోటు పొడిచిన నాయకులను కూడా పక్కన పెట్టామన్నారు. అలాంటి వారిని దూరంగా ఉంచటం వల్ల ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల సమ్మతి లేకుండా బీఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకోకూడదని తాము తీసుకున్న నిర్ణయానికి కేడర్ నుంచి స్పందన వచ్చిందన్నారు. ఎమ్మెల్యే అనుమతి లేకుండా నియోజకవర్గంలో కొందరు ర్యాలీలు చేస్తున్నారని, ఇక్కడ పార్టీలో వర్గాలు సృష్టించే ప్రయత్నం చేస్తే సహించబోమని అన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇక్కడ కాంగ్రెస్ గ్రూపు మాత్రమే ఉంటుందన్నారు. మా అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు పెట్టటానికి వీలు లేదన్నారు. ఈ చర్యలను కార్యకర్తలు సహించబోరని, తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనుమతి తీసుకొని కార్యక్రమాలు చేయాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీ కోసం కృషి చేసిన మిత్రపక్ష పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సత్తుపల్లి, వేంసూరు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, కాసరి చంద్రశేఖరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, నాయకులు చల్లగుళ్ల నరసిహారావు, ఉడతనేని అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలివ్వాలి

వైరా, జూన్ 5: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రైతులకు 2200క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం ఉండగా కేవలం 800క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే సరఫరా చేశారన్నారు. ఏవో ఎస్.పవన్‌కుమార్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సమత, నాయకులు మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలపై ఏడీఏ అవగాహన

వైరా మండలంలోని తాటిపూడి గ్రామంలో బుధవారం పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునే పద్ధతిపై ఏడీఏ టి.కరుణశ్రీ, ఏవో ఎస్.పవన్‌కుమార్ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో రాజేష్ పాల్గొన్నారు.

కొణిజర్లలో భారీ వర్షం

కొణిజర్ల, జూన్ 5: గాలిదుమారంతో 30 నిమిషాలు పాటు కురిసిన వర్షం భీభత్సాన్ని సృష్టించిన్నట్లయింది. బుధవారం సాయంత్రం ప్రజలను అతలాకుతలం చేసింది. ప్రజలంతా ఉరుకులు పరుగులు తీశారు. కొణిజర్ల, తనికెళ్లలో చెట్లు పడ్డాయి.

నీట్ ఫలితాల్లో ఎలైట్ అకాడమి ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న అకాడమి డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 5: మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని ఎలైట్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారని అకాడమి డైరెక్టర్లు కటకం కీర్తి, రమణ, చల్లా శ్రీధర్ తెలిపారు. అకాడమికి చెందిన డి ప్రిన్స్ 617 మార్కులతో టాపర్‌గా నిలిచాడని తెలిపారు. 10 మందికి 500 మార్కులకు పైగా, 22 మందికి 450కి పైగా, 42 మందివిద్యార్థులకు 400ల మార్కులకు పైగా సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

నీట్‌లో మెరిసిన వైరా, కూసుమంచి విద్యార్థులు



వైరా/కూసుమంచి జూన్ 5: వైరాకు చెందిన బొంతు భగత్ జాతీయ మెడికల్ ప్రవేశ పరీక్షలో 595మార్కులు సాధించాడు. వైరా మాజీ ఎంపీపీ బొంతు సమత, రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు దంపతుల కుమారుడైన భగత్ నీట్‌లో 720మార్కుకులకుగానూ 595 మార్కులు సాధించాడు. భగత్‌ను పలువురు అభినందించారు.



కూసుమంచి: కూసుమంచికి చెందిన వడ్డమూడి ప్రకృతి నీట్-2024 పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. జాతీయ స్థాయిలో 720 మార్కులకు గాను 651 మార్కులు (98.75శాతం) సాధించింది. కూసుమంచి ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్న వడ్డమూడి వెంకటేశ్వర్లు, లోక్యాతండలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న చావా స్వరూప కూతురు. ప్రకృతిని ఎంఈవో రామాచారి అభినందించారు.

లోవోల్టేజీ సమస్యల పై డివిజనల్ ఇంజనీర్ విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోనకల్, జూన్ 5: మండలంలోని రావినూతల గ్రా మంలో లో వోల్టేజీ సమస్యల గురించి 'ఆంధ్రజ్యోతి'లో కథ నం ప్రచురితం కావడం పాఠకులకు విదితమే. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సమస్యల పై రావినూతల గ్రామంలో బుధవారం వైరా విద్యుత్‌శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి. రామకృష్ణ విచారణ నిర్వహించారు. ట్రాన్స్‌పార్మర్లకు సంబంధించి విద్యుత్ సరఫరాను పరిశీలించారు. కొంత మంది రైతుల మోటర్లు, విద్యుత్ ఉపకరణాలు కాలిపోవడం వాటిలో తలెత్తిన సాంకేతిక సమస్యల వలన మాత్రమేనని తెలిపారు. ట్రాన్స్‌పార్మర్ల వద్ద లోవోల్టేజీ సమస్య లేదని నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఇదిలా ఉండగా మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ మాట్లాడుతూ లో వోల్టేజీ సమస్యలతో తాము ఇబ్బందులు పడ్డామని, తన విద్యుత్ మోటర్లు కూడ వ్యవసాయ సీజన్లో కాలిపోయాయని చెప్పారు.

ఏపీలో విజయంతో టీడీపీ, జనసేన సంబురాలు

కల్లూరు/వైరా/తిరుమలాయపాలెం, జూన్ 5 ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధింటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కల్లూరు పట్టణంలో బుధవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా అదరణతో కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించటం ఆదర్శ రాజకీయాలకు సంకేతంగా అభ వర్ణిస్తూ స్థానికంగా ఆయా పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా విజయోత్సవ ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జాస్తీ శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కాకర్ల రంగారావు, మండల నాయకులు బాణోతు చిట్టిబాబు, మాజీ ఎంపిటిసి పోట్రు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు, జనసేన నాయకుడు కళ్యాణపు కిషోర్ పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే

వైరా: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ కూటమి విజయం సాధించిన సందర్భంగా బుధవారం వైరాలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సంబరాల్లో స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఏపీలోని టీడీపీ కూటమి అత్యధిక మెజార్టీతో ఘనవిజయం సాధించటం పట్ల ఆపార్టీ నాయకులు సంబరాలు చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ టీడీపీ కార్యాలయంలో జరిగిన సంబరాల్లో పాల్గొని ఆపార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, శీలం నాగిరెడ్డి, బీడీకే.రత్నం, చింతనిప్పు మాధవరావు, పొదిల హరినాథ్, మోరంపూడి బాబూరావు పాల్గొన్నారు.



కల్లూరులో టీడీపీ, జనసేన సంబురాలు

తిరుమలాయపాలెం: ఏపీలో టీడీపీ కూటమి భారీ విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు బుధవారం సంబరాలు జరిపారు. తిరుమలాయపాలెంలో ఏర్పాటు చేసిన కేక్‌ను పాలేరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ కట్ చేసిపంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయులు కొప్పుల వెంకటరావు, మల్లీడి రమేష్, మల్లీడి నాగన్న, మల్లీడి భాగ్యమ్మ, మండల అధ్యక్షుడు నామా ప్రసాద్, కొలిశెట్టి బిక్షం, దాసరి గోవర్ధన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: సీపీఎం

ముదిగొండ, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక మచ్చా వీరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.ఐదులక్షల కోట్ల అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు నెలకు రూ.2500ఇస్తామన్న హామీని త్వరగా అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 22,23తేదీల్లో ముదిగొండ మండలస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, టీఎస్.కల్యాణ్, వేల్పుల భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు, మందరపు వెంకయ్య, పద్మ, కోలేటి ఉపేందర్, ప్రభావతి పాల్గొన్నారు.

కొణిజర్లలో కాంగ్రెస్‌దే హవా

- భారీగా తగ్గిన బీఆర్ఎస్ ఓట్లు

కొణిజర్ల, జూన్ 5: వైరా నియోజకవర్గంలో కొణిజర్ల మండలం అటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లోను కాంగ్రెస్ హవా కొనసాగింది. కొణిజర్ల మండలంలో మొత్తం 49,026 మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ కంటే కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన మాలోతు రాందాస్‌నాయక్ 9469 ఓట్ల మెజార్టీని సాధించారు. అప్పుడు కాంగ్రెస్‌కు 24617 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 15148 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీలోనైన బీఆర్ఎస్‌కు అన్ని ఓట్లు వచ్చినప్పటికి శాసనసభ ఎన్నికల్లో కేవలం మండల వ్యాప్తంగా 9746 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు 26,431 ఓట్లు వస్తే బీఆర్ఎస్‌కు 9746 ఓట్లు రాగా బీజేపీకి 3203 ఓట్లు వచ్చాయి. బీజేపీ ఓటు బ్యాంకు కూడ అసెంబ్లీ కంటే పెరిగింది. హస్తం అసెంబ్లీ కంటే లోక్‌సభలో 16,685 ఓట్ల మెజార్టీ వచ్చింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ కొణిజర్ల మండలంలో దూసుకపోతుంది అనటానికి ఓటర్లు ఇచ్చిన తీర్పు ఇది. వైరా నియోజకవర్గంగా చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ చూస్తే కొణిజర్లలో 16685 రాగా వైరాలో 13840, ఏన్కూర్ 9070, జూలూరుపాడు 6793, కారేపల్లి 15390 ఓట్ల మెజార్టీ వచ్చింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ తన హవా కొనసాగించింది. మెజార్టీ పరంగా చూస్తే రెండోస్థానంలో కారేపల్లి ఉంది. కొణిజర్ల మండలంలో బీఆర్ఎస్ తన ఓటు బ్యాంకును చూపించుకోలేకపోయింది. ఆ పార్టీలోనే ఓట్లు తక్కువ రావటంపై విభిన్నంగా చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందిన రామసహాయం రఘురాంరెడ్డికి కొణిజర్ల మండలంలో అధిక ఓట్లు వేసి ఓటర్లు తమ తీర్పును ఇచ్చారు. కొణిజర్ల మండల ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లోనూ, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు.

సమష్టి కృషితోనే రఘురాంరెడ్డి భారీ విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూన్ 5: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి భారీ విజయం సాధించటం పట్ల వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వామపక్షాలు సమిష్టిగా కృషిచేయడంతో భారీ మెజార్టీతో రఘురామిరెడ్డి గెలుపొందారని వ్యాఖ్యానించారు. బుధవారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4.62లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో భారీ విజయాన్ని అందించిన ప్రజలకు, అందుకు కృషిచేసిన ప్రతి కార్యకర్త, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైరా నియోజకవర్గంలో 61,778ఓట్ల మెజార్టీ ఇచ్చిన ప్రజలకు కూడా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, గుత్తా వెంకటేశ్వరరావు, పొదిల హరినాథ్, బోళ్ల గంగారావు, పాలేటి నర్సింహారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పమ్మి అశోక్, పణితి శ్రీను, పల్లపు కొండలు, వాడపల్లి రామారావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, మోరంపూడి బాబు, మేదూరి రామారావు పాల్గొన్నారు.

మధిరలో మండలాల వారీగా కాంగ్రెస్ మెజార్టీ

మధిర: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి మధిర నియోజకవర్గంలో 63,470 ఓట్లు రాగా మండలాల వారీగా వచ్చిన మెజార్టీ ఓట్లు ఇలా ఉన్నాయి. ముదిగొండ మండలంలో 14,200 మెజార్టీ రాగా చింతకాని మండలంలో 9924 ఓట్ల మెజార్టీ, బోనకల్ మండలంలో 10,461 ఓట్లు, మధిర రూరల్‌లో 8,080 ఓట్లు, టౌన్‌లో 7,536ఓట్లు, ఎర్రుపాలెం మండలంలో 13,331 ఓట్లు మెజార్టీ వచ్చాయి. ఇంత భారీ మెజార్టీ గత ఏ ఎన్నికల్లోనూ ఇంతవరకు ఎవరికీ రాలేదు.

విద్యుత్ ఉపకేంద్రాల సామర్థ్యం పెంపు

- ఎస్ఈ సురేందర్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగిన విధంగా ఖమ్మం నగరంలోని విద్యుత్ ఉపకేంద్రాల సామర్థ్యం పెంపునకు ఎస్ఈ సురేందర్ శాఖా పరంగా ఏర్పాట్లు చేశారు. ఖమ్మంనగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులోని విద్యుత్ ఉప కేంద్రం ద్వారా కవిరాజ్‌నగర్, బైపాస్ రోడ్డు, వేణుగోపాల్‌నగర్, విజయనగర్ కాలనీ, బ్యాంకు కాలనీ, వీడియోస్ కాలనీ సమీప ప్రాంతాలకు విద్యుత్ పంపిణీ జరుగుతుంది. అయితే ప్రతి నెల 90నుంచి 100వరకు గృహ నిర్మాణం, కమర్షియల్ విద్యుత్ మంజూరు జరుగుతున్నాయి. విద్యుత్ ఉపకేంద్రం పరిదిలో మొత్తం 18వేల వరకు విద్యుత్ కనెక్షనలు ఉన్నాయి. 8మెగా ఓల్టా ఎంపీయర్(ఎంవీఏ) సామర్థ్యంతో నిర్వాహణ కొనసాగటంతో వేసవి కాలంలో విద్యుత్ అధిక లోడ్‌తో విద్యుత్ అంతరాయం ఏర్పాడింది. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు శాకా పరంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. 12.5 ఎంవీఏకు బుధవారం సామర్థ్యం పెంచుతూ అధునిక విద్యుత్ పరికాలను నిర్మాణం చేశారు. టౌన్ 3 విద్యుత్ పరిదిలో అధిక లోడ్ సమస్య లు తీరనున్నాయి. పనులను ఎస్ఈ సురేందర్ పర్యవేక్షణ చేయగా డీఈ రామారావు, ఎంఆర్‌టీ, డీఈ భద్రపవర్, ఆపరేషన్ ఏడీఈ నాగమల్లేశ్వరరావు, ఏఈ తావుర్య పాల్గొన్నారు.



విద్యుత్ ఉపకేంద్రంలో ఎస్ఈ సురేందర్, అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: ఏడీఏ

ఎర్రుపాలెం/మధిర/తిరుమలాయపాలెం జూన్ 5: మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తన, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో వానాకాలం సాగుకు సమాయత్నపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు హాజరయ్యి డీలర్లకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనాల స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారికి సమాచారమందించి, షాపుల వద్ద గల స్టాకుబోర్డు పొందుపరచాలని సూచించారు. ప్రభుత్వ అనుమతిలేని కంపెనీల హైబ్రీడ్ విత్తనాలను అమ్మకాలు చేయటం చట్టరిత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొండూరి విజయభాస్కర్‌రెడ్డి, ఎఎస్ఐ గోపాలరావు, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

విత్తనాలను ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలి

మధిర: విత్తన డీలర్లు, వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని నిబంధనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచించారు. మధిర ఏడీఏ కె వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మధిర రైతు వేదికలో విత్తనాలు, ఎరువుల దుకాణాల వ్యాపారులు, పురుగుమందుల డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏవోడీఎన్‌కే శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు తప్పకుండా పాటిస్తూ విత్తనాలు అమ్మకాలు జరపాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిషేదించిన కలుపు మందులు ఏవీ అమ్మకూడదని తెలిపారు. నిబంధనలు తప్పకుండా పాటించాలని లేకుంటే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసమావేశంలో పలువురు విత్తన, పురుమందులు, డీలర్లు పాల్గొన్నారు.

- తిరుమలాయపాలెం: ఖరీఫ్‌లో రైతులకు నకిలీ విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సీతరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెం, పిండిప్రోలు, పాతర్లపాడు గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు వస్తాయని రైతులను నమ్మించి మోసం చేస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తనాల కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిచవవద్దన్నారు.అలాగే పత్తి విత్తనాలను పొడిదుక్కులో నాటుతున్నారని దీంతో నష్టానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఏఈవోలు బాలకృష్ణ, నవనిత, ఆసియా, ప్రసన్న పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ట్యాంక్‌బండ్‌పై డిగ్రీ విద్యార్థుల, అధ్యాపకుల అవగాహన ర్యాలీలు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి కవిత అన్నారు. బుధవారం ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీవో కవిత నగరంలోని గాంధీనగర్ సెక్టార్ పరిదిలోని పంపింగ్‌వెల్ రోడ్ అంగన్‌వాడీ కేంద్రం 2లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో బాగస్వాములు కావాలని, మొక్కలు పెంచటం, వాటిని పరిరక్షించటం వంటి అంశాలపై అంగనఃవాడి కేంద్రాలకు వచ్చే లబ్దిదారులకు, వారి కుటుంభ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడి టీచర్లు పి జ్యోతి, ఆర్ జ్యోతి, పద్మ, వాణి, ఆయాలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని బుధవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌లో గ్రీన్‌వాక్ పేరుతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సహజవనరుల పరిరక్షణ, మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సూర్యపేట జడ్పీ సీఈఓ డి శిరిష, ఆదర్శ రైతు రామిరెడ్డి, నవ్యజ్యోతి, అటవీశాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లకారం ట్యాంక్‌బండ్‌పై పర్యావరణ దినోత్స వేడుకలు

కిష్టారం ఓసీలో పర్యావరణ దినోత్సం

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్ కాస్టు పీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిష్టారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు అధికారి ఎంవీ. నరసింహారావు పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో సింగరేణి ఉద్యోగులు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. పర్యావరణ అధికారి సూర్యప్రకాష్ ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామకృష్ణ, అడిషనల్ మేనేజర్ బాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి: ఎంపీడీవో

కొణిజర్ల: ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిషత్ అధికారులు ప్లాస్టిక్ నిషేదించాలంటే ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రతిజ్ఞ చేపించారు. ఎంపీడీవో రోజారాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు తగ్గించాలని కోరారు. ఈజీఎస్ ఏపీవో అమ్మాజాన్, ఈసీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

లకారం ట్యాంక్‌బండ్‌పై పర్యావరణ వేడుకలు

ఖమ్మంకార్పొరేషన్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిదిగా పాల్గొన్న మందడపు సుధాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యత గురించి వివరించారు. టెర్రస్ గార్డెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు ముందుకు వచ్చి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈకార్యక్రమంలో మానుకొండ జ్యోతి, బత్తుల సరోజిని, వాసిరెడ్డి నిర్మల, షేక్ కైసర్,కె.శ్రీనివాస్ జడ్పీ డీప్యూటీ సీఈవో శిరీష నగర పాలక సంస్థ ఏఈ నవ్యజ్యోతి, ఎస్ఆర్ఐ ఫౌండేషన్ బాద్యులు బాబురావు, ఆర్గానిక్‌ఫార్మర్ రామిరెడ్డి పాల్గొన్నారు.